### బహుమతి పొందిన చిట్టికథ

# ఎర్ర గౌను

మందరప్పు లలిత



అరుంధతి బీరువాలో నుంచి పనికి రాని బట్టలన్నీ తీసి క్రింద గుట్టగా పడేసింది.

"ఇవన్నీ సరిగా మడతపెట్టవే మల్లీ!"

మల్లి ఒక్కొక్కటీ తీసి సర్దుతున్నది. చెమ్కీ పువ్వులు, చిన్న చిన్న అద్దాలతో ధగ ధగ మెరిసిపోతున్న ఎరుపు రంగు సిల్కు గౌను చూసి మల్లిక కళ్లు చెదిరిపోయాయి.

"ఈ చొక్కా ఎంత బావుందమ్మగారూ! అమ్మాయిగారు ఎప్పుడు ఏసుకోరేటండీ?"

"దానికి బిగువైపోయిందే!"

ఎనిమిదేళ్ళ మల్లి తన మనస్సులోని కోర్కెను దాచుకోలేకపోయింది. "అమ్మగారూ! ఇది నాకివ్వరూ?"

ఈ పనిమనుషులు అసాధ్యులు. ఈ పిల్ల వచ్చి రెండునెలలు పూర్తికాలేదు. అప్పుడే పాత చొక్కాకావాలట. తీరా ఇస్తే పనిమానేసి వాళ్ళ ఊరు వెళ్ళిపోతుందేమో? వీళ్ళ ఎత్తులు ఎవరికి తెలియవు? స్టీలు గిన్నెల వాళ్ళకిస్తే ఓ స్టీలు గిన్నయినా వస్తుంది.

"చెప్పినట్లు చెయ్యి! ఇవన్నీ కట్టకట్టి ఆ బుట్టలో పెట్టు!"

ఒక రోజు స్టీలు సామాన్లు అమ్మే గౌరి వచ్చింది. అరుంధతి పాతబట్టలిచ్చి ఓ స్టీలుగిన్నె తీసుకుంది. ఆ బుట్టల్లో మల్లి మనసుపడిన ఎర్రగౌను కూడా ఉంది.

"కాసిని మంచి నీళ్ళివ్వండమ్మా!" అనడిగింది గౌరి. మల్లి మంచినీళ్ళు తెచ్చి యిచ్చింది. గౌరి అరుగు మీద ఒక మూలగా కూర్చుని అన్నం తింటున్నది. మల్లి గౌరి పక్కనే కూర్చున్నది.

"ఈ బట్టలన్నీ ఏం చేస్తావ్?"

"అమ్ముకుంటాం!"

"ఈ ఎర్ర గౌను ఎంతకమ్ముతావ్?"

"గట్టిగా బాగుంది. ఐదురూపాయలైనా వస్తాది."

మల్లి నిరాశగా చూసింది" నా దగ్గర ఒక్కరూపాయే వుంది."

"ఈ గౌను నీక్కావాలా?" మల్లి తలాడించింది. గౌరి మల్లికి ఎర్ర గౌను తొడిగింది.

"ఈ గౌనులో ఎంత ముద్దొస్తున్నావో"

గౌరి మల్లిని ముద్దు పెట్టుకున్నది. మల్లి తన దగ్గరున్న రూపాయి ఇవ్వబోతే గౌరి పుచ్చుకోలేదు. "వద్దు పాపా! నాకు డబ్బొద్దు! ఈ చొక్కా తొడుక్కోవాలని నీ కెంత మనసుగా ఉందో పాపం!" గౌరి వెళ్ళిపోయింది.

"అమ్మగారూ! ఈ చొక్కా నాకు బావుందా?"

పేదగౌరికున్నపాటి జాలి, దయ తనకు లేకపోయాయి. సంతోషంతో ఉరకలు వేస్తూ తన వద్దకు పరిగెత్తుకొచ్చిన మల్లిని చూసి అరుంధతి సిగ్గుతో తల దించుకుంది. □